# ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!



# మోటర్ల వద్ద పడిగాపులే

## కాంగ్రెస్‌కు అవకాశమిస్తే అంధకారమే

- మూడు గంటల కరెంట్‌తో మునుగుడే
- 10 హెచ్‌పీ మోటర్లు మా నెత్తిన భారమే
- రాక ముందే మాపై ఇన్ని కుట్రలా..?
- ఆ పార్టీని నమ్మేది లేదు.. ఓటేసేదే లేదు
- 24 గంటల కరెంట్‌తోనే మాకు బతుకు
- కేసీఆర్ సారునే గెలిపించుకుంటం
- స్పష్టం చేసిన జిల్లా రైతులు

పెద్దపల్లి, నవంబర్ 28 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్‌కు అవకాశమిస్తే మళ్లీ ఎనకటి రోజులే వస్తాయని, ఎప్పుడొస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియని కరెంట్ కోసం వ్యవసాయ మోటర్ల వద్ద పడిగాపులు కాయాల్సి వస్తుందని కర్షకులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడు వస్తున్న 24 గంటల ఉచిత కరెంట్ పోతుందని, మళ్లీ మూడు గంటలే దిక్కవుతుందని హెచ్చరిస్తున్నారు. నాడు నలభై రెండేండ్ల కాంగ్రెస్ పాలన, పదహారేండ్ల టీడీపీ పాలన చూశామని, యాభై ఎనిమిదేండ్ల సమైక్య పాలనలో ఎవరూ ఇవ్వలేని కరెంటును కేసీఆర్ మాత్రమే ఇచ్చారని స్పష్టం చేస్తున్నారు. ఆనాడు సాధ్యం కానిది ఇవ్వాళ ఎలా సాధ్యమైందంటే.. ఈ ప్రాంత రైతులపై కేసీఆర్‌కు ఉన్న ప్రేమే కారణమంటున్నారు. సాగునీరు, 24 గంటల కరెంటు, రైతు బంధు, రైతు బీమా వంటివి ఇస్తూ దేశంలోనే ఎక్కడా లేని విధంగా తమకు అండగా నిలుస్తున్నారని హర్షం వ్యక్తం చేస్తున్నారు. డెబ్బై ఆరేండ్ల స్వతంత్ర దేశ చరిత్రలో.. నేటికీ ఏ రాష్ట్రంలో లేని విధంగా రైతులకు 24 గంటల కరెంటు ఇస్తున్నది కేసీఆర్ మాత్రమే అని ప్రశంసిస్తున్నారు. కొన్నేళ్లుగా కరెంట్ కష్టాలు లేవని, తమకు నచ్చిన సమయంలో వెళ్లి మోటర్లు పెట్టి సాగు చేసుకుంటున్నామని చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో కాంగ్రెస్ నేతలు కరెంట్‌పై పూటకో మాట చెబుతూ పరేషాన్ చేస్తున్నారని, వారిని నమ్మితే మళ్లీ మోటర్ల కాడ జాగారం చేయక తప్పదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రైతులపై కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారని, అందుకే మళ్లీ 3 గంటలు అని, 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకోవాలని చెబుతున్నారని మండిపడుతున్నారు. అసలు కరెంట్ మంచిగున్న చోట మళ్లీ కరెంట్ గురించి ఎందుకు మాటాడుతున్నారని, కర్ణాటకలో ఐదు గంటల కరెంటే సక్కగ ఇవ్వకుండా ఇక్కడ ఏం ఉద్ధరిస్తారని ప్రశ్నిస్తున్నారు. సద్ది తిన్న రేవు తలువాలంటే.. మనకు మేలు చేసిన వారికి అండగా నిలువాల్సిన అవసరముందని చెబుతున్నారు. కరెంట్, నీళ్లకు ఏబాధా లేకుండా చేసిన కేసీఆర్ వెంటే తాము స్పష్టం చేస్తున్నారు.

### ❖ పెద్ద మోటర్ పెడితే బతుకులు చీకట్లే..



నాకు రెండెకరాల భూమి ఉన్నది. వరి. పత్తి సాగు చేసుకుంటున్న. మూడు గంటల కరెంట్ అంటున్న కాంగ్రెస్‌కు అధికారం వస్తే చీకటి రోజులు ఖాయం. 10 హెచ్‌పీ వ్యవసాయ మోటర్లు పెట్టుకోవాలంటున్నరు. ఎవుసం తెల్వనోడు కరెంట్ గురించి మాట్లాడితే చిత్రంగా ఉంది. బీఆర్ఎస్ ప్రభుత్వం నిరంతర విద్యుత్ రైతులకు ఇస్తే సోయి లేని కాంగ్రెస్‌కు ఎందుకు నొప్పి. రైతులు రంది లేకుండా మంచిగ బతుకద్దా. మళ్లా కరెంట్ కోతలు, మోటర్లు కాలుడు, ట్రాన్స్‌ఫార్మర్లు పేలుడు షురూ చేసేటట్టున్నరు. పండుగలా మారిన ఎవుసం దండుగా చేయడానికి కుట్ర చేస్తున్నరు. 24 గంటల కరెంట్‌తో మా వీలును బట్టి పంటలు సాగు నీరు పెట్టుకుని కంటినిండా నిద్రపోతున్నం. బీఆర్ఎస్ సర్కార్ ఇచ్చిన నిరంతర విద్యుత్‌తో రాత్రిపూట చావులు తప్పినయ్. మా పంటలకు సాగు నీరు పూర్తిగా అందుతుంది.

**-కోరుకంటి లక్ష్మణ్, రైతు, బాలరాజ్‌పల్లి (జూలపల్లి)**

### ❖ మళ్లా వలసెల్లిపోవుడే అయితది..



తెలంగాణ రాక ముందు రైతులందరూ అరిగోస పడ్డరు. కరెంట్ లేక, సాగునీరు రాక ఉన్న భూములను పడావుపెట్టి బతుకు దెరువుకు పట్నాలకు పోయ్యేది. కానీ సీఎం కేసీఆర్ అచ్చినంక రైతులకు అంతా మంచి జరుగుతున్నది. పెట్టుబడి సాయం అందుతున్నది. ఫుల్ కరెంట్ ఉంటున్నది. సాగునీరు బాగా అందుతున్నది. కానీ కాంగ్రెస్ పార్టీ 3 గంటల కరెంట్ మాత్రమే వ్యవసాయానికి సరి పోతుందనడం సరికాదు. అస్సలు 3 గంటల కరెంట్‌తో ఏవుసం చేయొస్తదా..? పంటలకు సాగు నీరు అందక సాగు విస్తీర్ణం పూర్తిగా తగ్గి పోతుంది. తెలంగాణ రాక ముందుకు ఏ పరిస్థితులు ఉన్నాయో మళ్లీ ఆ పరిస్థితులే తీసుకు వచ్చేలా ఉన్నారు. భూములు బీడుగా మారి రైతులు వలసెల్లి పోయే పరిస్థితి వత్తది. అందుకే పచ్చాగ కనపడుతున్న పచ్చటి పొలాలపై కనె్ర చేసేలా 3 గంటల కరెంట్ చాలు అంటూ విషం చిమ్ముతున్నారు. కాంగ్రెస్సోళ్లకు రైతులమంతా తగిన బుద్ధిచెప్తాం.

**-గూడ విజయ్, రైతు, వెంకటాపూర్, మంథని రూరల్.**



### ❖ మూడుగంటల కరెంట్‌తో భూములు పడావే..?

మాది కాల్వశ్రీరాంపూర్ మండలం జాఫర్‌ఖాన్‌పేట గ్రామం. నాకు నాలుగెకరాల భూమి ఉంది. అందులో వరి పత్తి పంట పండిస్తున్న. ఇప్పుడిచ్చే కరెంట్ మంచిగున్నది. ఈ కరెంట్ తో దో పసల్ పండిస్తున్నం. ఇప్పుడైతే కరెంట్‌కు మాకు ఇబ్బంది లేదు. కాంగ్రెసోళ్లు చెప్పే మూడుగంటల కరెంట్‌తో భూములు పడావు పెట్టుకొనుడే. భూములన్నీ బీళ్లుగా మారుతాయి. మళ్లీ ముల్లేమూట సర్దుకొని పోవుడే. మూడుగంటలకు మూడు గుంటల భూమి కూడా తడువది. పారిందే పారుతది. 3గంటల కరెంట్ తో సాగు చేసుడు ఎట్లనో కాంగ్రెసోళ్లు చెప్పాలే. బీఆర్ఎస్ అచ్చినంకనే మాకు అన్ని సౌలతులు అయినయ్. మళ్లీ కాంగ్రెసోళ్లు వచ్చి 3గంటల కరెంట్ ఇచ్చి మా కొంపలు ముంచుదామనే కదా ఇదంతా చేసేది. మూడు గంటల కరెంట్ అంటున్న కాంగ్రెస్‌ను తరిమికొడుతాం. కాంగ్రెసోళ్ల మాటలు నమ్మేంత బుద్ధి తక్కువోళ్లం కాదు. మూడు గంటల కరెంట్ కోసం 10 హెచ్‌పీ మోటార్లు కొనుక్కోవాలా? రైతులను దెబ్బతీసుడే కాంగ్రెస్ పని.వాళ్ల మాటలు నమ్మితే మునుగుడు ఖాయం.

**-అంకతి కొమురయ్య. రైతు. జాఫర్‌ఖాన్‌పేట. (కాల్వశ్రీరాంపూర్).**

### ❖ పెద్దమోటర్ అంటే ఉన్న భూమి ఎండబెట్టుడే..



కాంగ్రెస్ పాలనలో ఉన్నప్పుడు రైతులకు 3 గంటల కరెంట్ కూడ ఇయ్య చేతకాలే. కానీ ఇప్పుడు 10హెచ్‌పీ మోటార్లను పెట్టాలని అనడం రైతులను మరోసారి మోసం చేసే కుట్రనే. రేవంత్‌రెడ్డి 3 గంటల కరెంట్ వ్యవసాయానికి సరి పోతుందని అనడం సిగ్గు చేటు. 10హెచ్‌పీ మోటార్లు పెడితే ఎంత ఖర్చు అవుతుదో అల్లకు ఎరికనేనా. రైతులకు ఎన్ని తిప్పలు ఉంటయో తెలుసునా. కాంగ్రెస్ పాలన ఉన్నప్పుడు పంట పొలాలకు నీళ్లు పెట్టిందుకు పడరాని పాట్లు పడ్డాం. నీళ్లు అందక పంటలు ఎండి పోయేవి. ఈ సర్కారు అచ్చినంకనే మంచి జరుగుతుంది. అందుకే ఈ పార్టీ దిక్కే ఉంటం. మళ్లా కేసీఆర్‌నే తెచ్చుకుంటం.

**-కొత్తపల్లి మహేశ్, రైతు, (మంథని)**

### ❖ కాంగ్రెస్‌ది కండ్లమంటతనం



మూడు గంటల కరెంట్‌తో రైతులకు మళ్లీ పాత కష్టాలు తప్పవు. తెలంగాణ ప్రభుత్వం ఇచ్చే 24 గంటల ఉచిత కరెంట్‌తో ఎలాంటి ఇబ్బంది లేకుండా పంటలు పండిచ్చుకుంటున్నం. కాంగ్రెసోళ్ల పాలనలో సక్కగ కరెంట్ లేక, ఉన్న నీళ్లు కూడా పంటలకు అందక రైతులు నష్టపోయారు. ఎవుసం గురించి తెల్వనోడు ఎన్నో మాట్లాడుతడు. కాంగ్రెస్ ఇస్తామని చెబుతున్న మూడు గంటల కరెంట్‌తో పొలాలకు నీళ్లు సక్కగ పారవు. ఇప్పుడున్న 24 గంటల కరెంట్ తో అవసరం ఉన్నప్పుడల్లా పొలాలకు నీళ్లు పెట్టుకుంటున్నం.. రైతుల పై ఉన్న ప్రేమతో సీఎం కేసీఆర్ సర్కార్ 24గంటల ఉచిత కరెంట్ ఇస్తే కాంగ్రెసోళ్లకు ఎందుకింత కండ్లమంటతనం. రైతుల్ని కాంగ్రెసోళ్లు బతుకనియ్యరా ఇగ.. మూడు గంటల కరెంట్ ఇచ్చే కాంగ్రెసోళ్లు మాకద్దు. మూడు గంటల కరెంట్ ఇస్తమని చెప్పే కాంగ్రెసోళ్లను దగ్గరికి రానివ్వద్దు.

**- ఏడుమ్యాకల రాజు. రైతు. పెద్దరాత్‌పల్లి (కాల్వశ్రీరాంపూర్)**

### ❖ పది హెచ్‌పీ మోటర్‌తో ఎకరం పారదు



కోల్‌సిటీ, నవంబర్ 28: నాడంటే ఎవుసం మా కట్టముండె. కరెంటు ఉంటే నీళ్లు ఉండకపాయె..నీళ్లు ఉంటే కరెంటు ఉండదు. కానీ, బీఆర్ఎస్ ప్రభుత్వం అచ్చినంక రైతులకు 24 గంటల కరెంటు ఉంటంది.. పుష్కలంగా సాగునీళ్లు ఉంటున్నయ్. ఏ ఇబ్బంది లేకుండ ఎవుసం చేసుకుంటున్నం. ఇప్పుడు ఎవరికి కట్టం అచ్చిందని కాంగ్రెసోళ్లు 3 గంటల కరెంటు ఇత్తమంటుర్రు. ఆ మూడు గంటల కరెంటు ఏ మూలకు సరిపోద్ది. ఒక్క ఎకరం గూడ సరిగ్గా తడ్వదు. మిగత ఎకరాలు ఎండుడె ఇగ. ఇంక 10 హెచ్‌పీ కెపాసిటి మోటర్లను పంపుసెట్ల కాడ పెట్టుకోవాలె అని ఉచిత సలహాలు ఇస్తున్నరు. అంత పెద్ద మోటర్ కొనాలంటే ఖర్చులు ఎవరు భరిత్తరు. అప్పటి సమైక్య పాలన రోజులను మళ్లీ తీసుకవస్తారా ? ఇప్పుడు ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వ 24 గంటల కరెంటు విధానమే సక్కగుంది.

**- జనగామ వెంకటి, జనగామ (రామగుండం 9వ డివిజన్)**

### ❖ మూడు గంటలిత్తే అంతా ఆగమే..



కాంగ్రెస్ మూడు గంటల కరెంట్ కుట్రలు మొదలు పెట్టింది. మూడు గంటల కరెంట్ అంటూ రైతులను ఆగం చేయడానికి ప్రయత్నిస్తుంది.పాత రోజుల్లో కరెంట్ లేక సాగు నీరు అందక నెర్రెలు పడి పంటలు ఎండిపోయినయ్. మోటర్లు కాలిపోతే రిపేర్లు చేయించుకోడానికి ఇబ్బందులు పడినమ్. అప్రకటిత విద్యుత్ కోతల కాంగ్రెస్‌ను తరిమికొడితేనే నయం. లోవోల్టేజీ సమస్యతో ఆగమాగమైనమ్. రాత్రిపూట కరెంట్ కోసం టార్చిలైట్లు పట్టుకుని బాయిలకాడికి వెళ్లినమ్. పాములు, తేళ్లు కుట్టినయ్. చలికి వణికి పొలాల కాడ పడుకుని సాగు నీరు పెట్టుకున్నం. అవన్నీ యాదికున్నయ్. గిప్పుడేమో మూడు గంటల కరెంట్ చాలని అంటున్న కాంగ్రెస్‌ను పాతరేస్తమ్. 24 గంటల కరెంట్ ఇస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వమే మాకు కావాలి. రైతుల బతుకులను ఆగం చేసే పార్టీకి మేమెందుకు మద్దతు ఇస్తం.

**-గుమ్మడి రాజిరెడ్డి, రైతు, జూలపల్లి (జూలపల్లి)**